ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -81 పేజీలు - 04 వెల - 04/- గురువారం2 ఏప్రిల్ 2026

# అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం





## సభలో బిల్లు ప్రవేశ పెట్టిన నిత్యానంద రాయ్

## చర్చలో పాల్గొన్న 11 పార్టీల ఎంపిలు

## ఏకగ్రీవంగా ఆమోదించిన సభ

## వైకాపా సభ్యుల వాకౌట్

**న్యూఢిల్లీఏప్రిల్1 ఆంధ్ర ప్రగతి** ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన చట్ట సవరణ పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సుమారు రెండు గంటలపాటు దీనిపై చర్చ జరిగింది. తెదేపా, భాజపా, జనసేన, కాంగ్రెస్, వైకాపా, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది. లోక్‌సభలో ఆమోదం పొందిన అనంతరం ఈ బిల్లు రాజ్యసభకు వచ్చినట్లు సెక్రటరీ జనరల్ ప్రకటించారు. గురువారం కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ దీన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మొదలు దాదాపు గంటసేపు బిల్లుపై చర్చ జరిగే అవకాశం ఉంది. అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడంతో ఈ బిల్లుకు ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. అమరావతి బిల్లుపై చర్చలో 11 పార్టీలకు చెందిన 18 మంది ఎంపీలు పాల్గొన్నారు.

మిగతా 2లో.

# అమరావతి ఇక ప్రజారాజధాని..

## ఇంచుకూడా కదలించలేరు

## వింజమూరు పర్యటనలో సిఎం చంద్రబాబు

**నెల్లూరు, ఏప్రిల్1 ఆంధ్ర ప్రగతి**
నా జీవితంలో వైసీపీ లాంటి పార్టీని, జగన్ లాంటి వ్యక్తిని చూడలేదు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని విధ్వంసం చేసి ఆనందించారని మండిపడ్డారు. అమరావతి తీర్మానం రోజున వైసీపీ సభ్యులు అసెంబ్లీకి రాలేదన్నారు. అమరావతి ఏకైక ప్రజా రాజధాని అని... ఇక ఇంచు కూడా ఎవ్వరూ కదిలించలేరని స్పష్టం చేశారు. సిఎం వింజమూరులో సిఎం పర్యటించారు. వింజమూరులో

మిగతా 2లో.



# చారిత్రాత్మక ఘట్టం

## ఇది ప్రజా విజయం అంటూ పవన్ కల్యాణ్ ప్రకటన

## 33 వేల ఎకరాలిచ్చిన రైతులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు వెల్లడి

## ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబులకు హృదయపూర్వక కృతజ్ఞతలు



2లో.

# నాటో కూటమి నుంచి వైదొలగే యోచనలో అమెరికా... ?

## ట్రంప్ వ్యాఖ్యలు దేనికి సంకేతం?



2లో.

# చేనేతలకు ఉచిత విద్యుత్

## చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు

## మరమగ్గాలకు నెలకు 500 యూనిట్లు

## ఏటా ప్రభుత్వం 150కోట్ల భారం

## వెల్లడించిన మంత్రి గొట్టిపాటి



**అమరావతిఏప్రిల్1 ఆంధ్ర ప్రగతి**
ఇచ్చిన హామీ మేరకు చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌అన్నారు. ఈ పథకం ద్వారా ఏటా ప్రభుత్వం రూ.150కోట్లు పైనే భరిస్తోందని మంత్రి వెల్లడించారు. ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ జగన్ నాశనం చేసిన విద్యుత్ వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో గాడిలో పెడుతున్నారని మంత్రి అన్నారు. 22 నెలలుగా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా

మిగతా 2లో.

# విద్యాశాఖపై లోకేశ్ సమీక్ష...

## మధ్యాహ్న భోజనం, క్లిక్కర్ విధానంపై కీలక ఆదేశాలు



**అమరావతిఏప్రిల్1 ఆంధ్ర ప్రగతి**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక సదుపాయాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా, విద్యావ్యవస్థలో చేపట్టాల్సిన సంస్కరణలపై ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో సమగ్రశిక్ష అధికారులతో

మిగతా 2లో.



2లో.

# శ్రీరాముని ఆశీస్సులతో ధర్మపాలన అందిస్తాం

## ఒంటిమిట్టలో సీతారాముల కళ్యాణోత్సవంలో సీఎం చంద్రబాబు

## స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పణ

## శ్రీరాముని స్ఫూర్తితో ధర్మబద్ధమైన పాలన అందిస్తామని స్పష్టీకరణ

## రామరాజ్యంలాగే కూటమి పాలన సాగాలని ఆకాంక్ష

# తేయాకు ఆకులు కోసి, కార్మికులతో సెల్ఫీ దిగిన ప్రధాని నరేంద్రమోదీ


## అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అసోంలో పర్యటించిన ప్రధాని మోదీ

## గోగముఖ్‌లో జరిగిన బహిరంగ సభకు హాజరు

## అసోంలో బీజేపీ హ్యాట్రిక్ సాధిస్తుందని ధీమా



2లో.




# సంక్షేమానికి పెద్దపీట

## దీపం 2.0, గ్యాస్ పైప్‌లైన్ ప్రణాళిక

## నీటి ప్రాజెక్టులు, చెరువు పునరుద్ధరణ చర్యలు

## నెల్లూరు జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి

## నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం ప్రారంభం

## రైతులతో సీఎం మాటామంతీ



# దోచుకోవడానికే అమరావతి ప్లాన్

## అబద్ధాలు, అడ్డగోలు సంపాదన బాబు నైజం

## రాష్ట్రానికి రాజధాని అన్నది ఎక్కడా లేదు

## కేంద్రానికి మాత్రమే రాజధాని అవసరం

## మావిగన్ అంటూ కొత్త ఆలోచన ప్రకటించిన జగన్

**అమరావతిఏప్రిల్1 ఆంధ్ర ప్రగతి**
చంద్రబాబు లాంటి వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం ఏపీ ప్రజలు చేసుకున్న దురదృష్టమని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. అమరావతి పేరుతో దోపిడీకి రంగం సిద్ధం చేశారని మండిపడ్డారు. అబద్ధాలు, అడ్డగోలు సంపాదన చంద్రబాబుకు తెలిసిన విద్య అని అన్నారు. చంద్రబాబుకు నిజాయితీ, చిత్తశుద్ధి లేవని, ఆయన దృష్టిలో పరిపాలన అంటే కేవలం అవినీతి, దోపిడీ మాత్రమేనని జగన్ దుయ్యబట్టారు.



మిగతా 2లో.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# అమరావతి ఇక ప్రజారాజధాని..

**మొదటిపేజీ తరువాయి**

నిర్వహించిన 'పేదల సేవలో' కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైసీపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'అమరావతికి చట్టబద్ధత తీర్మానంపై లోక్‌సభలో చర్చ జరుగుతోందని... ఆమోదం పొంది గురువారంరాజ్యసభకు వెళుతుందని సీఎం తెలిపారు. ఒకటో తేదీ వస్తే పేదలే గుర్తొస్తారని.. దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా ఫించన్లు పంపిణీ చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. 63 లక్షల మందికి ఫించన్లు ఇస్తున్నామన్నారు. ఫించన్లను మొక్కుబడిగా ఇవ్వడం లేదని... గౌరవంగా ఇంటి వద్దే ఇచ్చే కార్యక్రమం చేపట్టామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఫించన్లు, తల్లికి వందనం ఇచ్చామని తెలిపారు. స్త్రీశక్తి సూపర్ సక్సెస్ అయిందని.. ఆడబిడ్డలు దర్జాగా ఎక్కడికి వెళ్లాలంటే అక్కడికి వెళుతున్నారని తెలిపారు. 'మా ఆడబిడ్డల కోసం దీపం కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇచ్చాం. ఇప్పుడు మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. పీఎంజీ కనెక్షన్ తీసుకున్నా.. ఏడాదికి రూ.2,465లు సబ్సిడీ ఇస్తాం' అని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఏడాదిలో వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేసి ఉదయగిరికి కూడా నీరిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 'నాపై కోపంతో పోలవరం ప్రాజెక్ట్‌ను గోదావరిలో కలిపేశారు. గోదావరి పుష్కరాల లోపు పోలవరం పూర్తి చేస్తాం. శ్రీశైలం, పోలవరంతో ఉదయగిరి ప్రాంతానికి నీటి కొరత ఉండదు' అని అన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెరగడం లేదని.. అందుకే ఖ4 ప్రవేశపెట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

---------------

# అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**మొదటిపేజీ తరువాయి**

చర్చ తర్వాత అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ ప్రకటించారు. అమరావతి రైతుల త్యాగం అపారమైందని పలువురు ఎంపిలు అన్నారు. లోక్‌సభలో ఎంపీ మాట్లాడుతూ.. రైతుల త్యాగం ప్రపంచ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. రైతు భూమి కేవలం ఆస్తి కాదని, అది వారి జీవితంతో సమానమన్నారు. తండ్రికి బిడ్డతో ఉండే అనుబంధం ఎలా ఉంటుందో రైతుకు భూమితో బంధం ఉంటుందని వివరించారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం, భావితరాల భవిష్యత్తు కోసం రైతులు తమ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి సుమారు 33 వేల ఎకరాల భూమిని రాజధాని నిర్మాణానికి స్వచ్ఛందంగా ఇచ్చారన్నారు. ఈ త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది తెలిపారు. వైసీపీ నేతలు అమరావతిని తక్కువ చేసి మాట్లాడారని మండిపడ్డారు. అమరావతి అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరుగుతున్న సమయంలో వైసీపీ సభ్యులు వాక్‌అవుట్ చేయడం దురదృష్టకరమన్నారు. ఇది రాష్ట్ర ప్రజల భావోద్వేగాలను అవమానించినట్లే పలువురు ఎంపిలు తెలిపారు.

## శ్రీరాముని ఆశీస్సులతో ధర్మపాలన అందిస్తాం

**ఏప్రిల్1 ఆంధ్ర ప్రగతి**

శ్రీరాముడి ఆశీస్సులతో, ఆయన చూపిన మార్గంలో ధర్మాన్ని అనుసరించి రాష్ట్రంలో ధర్మబద్ధమైన పాలన అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాముడి పేరు వినగానే సుపరిపాలన, రామరాజ్యం గుర్తుకు వస్తాయని, అదే స్ఫూర్తితో తమ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. కడప జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఆయన తన అర్ధాంగి భువనేశ్వరితో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.

అంతకుముందు, ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి దంపతులకు టీటీడీ అధికారులు, పండితులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన ఈ నయనానందకరమైన కల్యాణ వేడుకను వేలాది మంది భక్తులు కనులారా వీక్షించారు. అనంతరం అర్చకులు ముఖ్యమంత్రిని ఆశీర్వదించి, స్వామివారి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా 'జై శ్రీరామ్' నినాదంతో తన ప్రసంగాన్ని ప్రారంభించిన చంద్రబాబు.. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా, సంపద, ఆరోగ్యంతో సంతోషంగా ఉండాలని శ్రీరాముడిని ప్రార్థించినట్లు తెలిపారు. "రాష్ట్ర విభజన అనంతరం ఒంటిమిట్ట ఆలయాన్ని టీటీడీలో విలీనం చేసి, ఏటా బ్రహ్మోత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నాం. ఈ రోజు మనకు ఎంతో పవిత్రమైనది" అని అన్నారు.

ఇదే రోజు లోక్‌సభలో అమరావతిని రాజధానిగా గుర్తిస్తూ ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. "పూర్వం దేవేంద్రుడు పాలించిన రాజధాని అమరావతి అయితే, నేడు మనం నిర్మిస్తున్నది ప్రజారాజధాని అమరావతి. శ్రీరాముని ఆశీస్సులతో ధర్మాన్ని పాటించి మీకు అండగా ఉంటాం. రామరాజ్యంలాగే మీకు సుపరిపాలన అందిస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు హామీ ఇచ్చారు.

## నాటో నుంచి వైదొలగే యోచనలో అమెరికా... ?

**ఏప్రిల్1 ఆంధ్ర ప్రగతి**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, నాటో సైనిక కూటమిపై మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నాటో ఒక 'కాగితపు పులి' అని అభివర్ణిస్తూ, కూటమి నుంచి వైదొలగే విషయం పునఃపరిశీలన స్థాయి కూడా దాటిపోయింది అని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో సైనిక ఘర్షణ విషయంలో యూరప్ మిత్రదేశాలు మద్దతు ఇవ్వకపోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇరాన్‌తో యుద్ధం, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు నాటో దేశాలు ముందుకు రాకపోవడాన్ని ట్రంప్ తప్పుపట్టారు. ఈ విషయంలో మిత్రదేశాలు 'పిరికిపందలు' అంటూ తన ట్రూత్ సోషల్ ఖాతాలో ఘాటుగా పోస్ట్ చేశారు. బ్రిటన్‌కు చెందిన 'ది టెలిగ్రాఫ్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో, నాటో నుంచి వైదొలగడం గురించి మాట్లాడుతూ, "అవును, ఈ విషయం గురించి ఇక ఆలోచించడానికేమీ లేదు. నేను నాటోను ఎప్పుడూ కాగితపు పులిగానే చూశాను, ఈ విషయం పుతిన్‌కు కూడా తెలుసు" అని స్పష్టం చేశారు."మేం ఉక్రెయిన్ విషయంలో వారికి (నాటో దేశాలకు) అండగా నిలిచాం. కానీ ఇరాన్ విషయంలో వారు మాకు మద్దతుగా నిలవలేదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఆయన అభిప్రాయానికి అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా మద్దతు తెలిపారు. "మనకు అవసరమైనప్పుడు సైనిక స్థావరాలను నిరాకరించే మిత్రదేశాలతో కూటమి వల్ల ప్రయోజనం ఏమిటి?" అని ప్రశ్నించారు. ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో స్పెయిన్, ఫ్రాన్స్ వంటి దేశాలు తమ సైనిక స్థావరాలను, గగనతలాన్ని ఉపయోగించుకోవడానికి అమెరికాకు అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే.

మిత్రదేశాల వైఖరితో 77 ఏళ్ల నాటి నాటో కూటమి భవిష్యత్తు ప్రమాదంలో పడింది. ఈ పరిణామాలపై ఇరాన్ విషయంలో బుధవారం రాత్రి ట్రంప్ జాతినుద్దేశించి ప్రసంగించనున్నట్లు వైట్‌హౌస్ ప్రకటించింది. దీంతో ఆయన ఏం మాట్లాడతారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## తేయాకు ఆకులు కోసి, కార్మికులతో సెల్ఫీ దిగిన ప్రధాని నరేంద్రమోదీ

**దిబ్రుగఢ్ ఏప్రిల్1 ఆంధ్ర ప్రగతి**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అసోంలోని దిబ్రుగఢ్ జిల్లాలోని ఒక తేయాకు తోటను సందర్శించారు. అక్కడి మహిళా కార్మికులతో కలిసి తేయాకు ఆకులను కోశారు. వారితో సెల్ఫీలు దిగారు. ఈ ఫొటోలను మోదీ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. పలువురు కార్మికులు మోదీతో సెల్ఫీ దిగేందుకు ఆసక్తి చూపించారు. మోదీ రాక నేపథ్యంలో గిరిజన కార్మికులు సంప్రదాయ నృత్యంతో ఆయనకు స్వాగతం పలికారు.అసోం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గోగముఖ్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అసోంలో బీజేపీ మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ యువరాజు రాహుల్ గాంధీకి వందోసారి ఓటమి తప్పదని ఎద్దేవా చేశారు.అసోం మాజీ సీఎం శర్బానంద సోనోవాల్, ప్రస్తుత ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ విభజన విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. అసోంలో ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఆదివాసీల హక్కులను కాపాడుతామని హామీ ఇచ్చారు.

# చారిత్రాత్మక ఘట్టం

**అమరావతిఏప్రిల్1 ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ ఏకైక, శాశ్వత రాజధానిగా అమరావతిని నిర్ధారిస్తూ లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందడంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర చరిత్రలోనే ఒక చారిత్రాత్మక, కీలకమైన ఘట్టమని అభివర్ణించారు. ఈ చరిత్రాత్మక సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు కోట్ల మంది ప్రజలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రజల సంకల్పానికి, ఆకాంక్షలకు ఈ బిల్లు ప్రతిబింబమని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా అమరావతి రైతుల మహోన్నత త్యాగాన్ని పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా స్మరించుకున్నారు. "తరతరాలు గుర్తుంచుకునేలా, అపారమైన విశ్వాసంతో 33,000 ఎకరాలకు పైగా భూములను రాజధాని కోసం త్యాగం చేసిన రైతులకు నా ప్రగాఢ గౌరవాన్ని, కృతజ్ఞతలను తెలియజేస్తున్నాను" అని పేర్కొన్నారు. అదే సమయంలో, అమరావతికి బలమైన పునాది వేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వాన్ని మనస్ఫూర్తిగా కొనియాడారు. ఈ బృహత్ కార్యం వాస్తవరూపం దాల్చడానికి నిరంతరం మద్దతుగా నిలుస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ఎన్డీయే ప్రభుత్వానికి పవన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# చేనేతలకు ఉచిత విద్యుత్

**మొదటిపేజీ తరువాయి**

ట్రూడౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది అని చెప్పుకొచ్చారు. యువగళం పాదయాత్రలో చేనేతలకు నారా లోకేశ్ ఇచ్చిన హామీ నేటి నుంచి అమల్లోకి రానుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా ధర్మవరం నియోజకవర్గంలో పాదయాత్ర సందర్భంగా చేనేతలు పడుతున్న కష్టాలను చూసిన లోకేశ్ వారికి ఇచ్చిన హామీని ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి చేర్చిందని తెలిపారు. జగన్ చేసిన నష్టాలను సరిదిద్దుతూనే రైతులు, చేనేతలు, ఆక్వా, సెలూన్‌లకు సబ్సిడీలు ఇస్తున్నామని అన్నారు. వినూత్న ఆలోచనలతో సోలార్, విండ్, పంప్‌డ్ స్టోరేజ్, బ్యాటరీ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజెన్ విధానాలతో విద్యుత్ కొనుగోళ్ల భారాన్ని తగ్గించుకుంటున్నామని తెలిపారు. బయట నుంచి విద్యుత్ కొనుగోళ్లు తగ్గించి.. చరిత్రలో లేని విధంగా రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి పెంచామని మంత్రి రవికుమార్ తెలిపారు. ఓల్టేజ్ సమస్యలు పరిష్కరించేందుకు పెద్దఎత్తున సబ్ స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. చంద్రబాబుకు ఉన్న అపార అనుభవంతో విద్యుత్ సంస్కరణలు ఇంతటితో ఆగేవి కాదని.. రానున్న రోజుల్లో ప్రజలకు మరింత వెసులుబాటు కల్పించేలా మార్పులు తీసుకొస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.ఇదిలావుంటే పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను సీజన్ ప్రారంభమయ్యే నాటికి మంజూరు చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు లేకుండా అవసరమైన అన్ని చర్యలూ చేపట్టినట్లు చెప్పారు. ఆర్డీఎస్ఎస్, పీఎం సూర్యఘర్, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, లోవోల్టేజీ సమస్యలపై సీపీడీసీఎల్, నెడ్‌క్యాప్ అధికారులతో సమీక్షించారు. 'గ్రామీణ ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. కొనుగోలు వ్యయం తగ్గించుకోవడానికి పునరుత్పాదక విద్యుత్ వినియోగం పెంచుకోవాలి. నియోజకవర్గానికి ఒక నమూనా సోలార్ గ్రామాన్ని అభివృద్ధి చేయాలి. విద్యుత్ వినియోగదారుల సంతృప్తస్థాయిని 90 శాతానికి పెంచాలని ఆదేశించారు. సౌర విద్యుత్ వినియోగాన్ని విస్తృతం చేసే దిశగా.. పీఎం సూర్యఘర్ కనెక్షన్లు మంజూరు చేయాలని రవికుమార్ అన్నారు. 'ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత సౌర విద్యుత్ కనెక్షన్లతో పాటు వేసవి ముగిసే నాటికి ప్రతి నియోజకవర్గంలో 6 వేల సూర్యఘర్ కనెక్షన్లు ఇవ్వాలి. ఆర్డీఎస్ఎస్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి. సీపీడీసీఎల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 11 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను తక్షణం ఇవ్వాలి. వినియోగదారుల అనుమతితో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.

# సంక్షేమానికి పెద్దపీట

**నెల్లూరు ఏప్రిల్1 ఆంధ్ర ప్రగతి**

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం ఉదయగిరి నియోజకవర్గం, వింజమూరులో పేదల సేవలో పాల్గొన్నారు. వింజమూరు ఎస్సీ కాలనీలో యరగొర్ల బాలమ్మ ఇంటికి వెళ్లి వితంతు పింఛను అందించారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. తన చిన్న కుమారుడు బాలరాజు కాలేయ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని బాలమ్మ సీఎం దృష్టికి తీసుకొచ్చారు. బాలరాజుకు ప్రభుత్వం తరఫున వైద్యం అందిస్తామని బాలమ్మ కుటుంబానికి సీఎం భరోసా ఇచ్చారు.

రాజధానిని విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని ఆయన వెల్లడించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలకు ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి.. ఈ బిల్లుకు మద్దతు పలికిన పార్టీలకు రాష్ట్ర ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియచేశారు. గత పాలకులు మూడు ముక్కలాటతో విధ్వంసం చేసి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని ఆక్షేపించారు. రాజధానికి చట్టబద్ధత కల్పించే అంశంపై అసెంబ్లీలో తీర్మానం పెడితే కనీసం శాసనసభ సమావేశాలకు కూడా ఆ పార్టీ హాజరు కాలేదన్నారు. రాజధాని ప్రాంతాన్ని స్మశానమని, ఏడారి అని, ముంపు ప్రాంతమని ఎగతాళి చేసి ఆనందించారని సీఎం ఆరోపించారు.

ప్రతీ నెలా మొదటి తేదీన పేదల సేవలో ద్వారా పెద్ద ఎత్తున సంక్షేమం చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. కూటమి ప్రభుత్వంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు అంతా పేదల సేవలో ఉంటున్నామని తెలిపారు. ప్రతీ నెలా రూ.2,750 కోట్లను పెన్షన్ల కోసం వ్యయం చేస్తున్న ప్రభుత్వం ఏపీనే అని సీఎం వివరించారు. పొరుగున తమిళనాడులో కేవలం రూ. వెయ్యి మాత్రమే పెన్షన్ గా ఇస్తున్నారని అన్నారు. ప్రజలపై ఉన్న అభిమానం తోనే పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాల్ని చేయగలుగుతున్నామని సీఎం వివరించారు. గత ఏడాది జూన్ లో తల్లికి వందనం కింద ఆర్థిక సహకారం అందించామని.. ఈ ఏడాది జూన్ లోనూ తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని తెలిపారు.

**త్వరలో పైప్ లైన్ లో గ్యాస్**

దీపం 2.0 కింద ఏడాదికి 3 ఉచిత సిలెండర్లను ఇస్తున్నామని త్వరలోనే ప్రతీ ఇంటికీ పైప్ ద్వారా గ్యాస్ అందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. దీని కోసం ఏడాదికి రూ.2400 సబ్సీడిని కూడా వినియోగదారుల ఖాతాల్లో వేస్తామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం అడ్వాన్సుగా రూ.1300 కోట్లను ఇచ్చిందని గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు పీ4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. 25 వేల కుటుంబాల్ని దత్తత తీసుకునేందుకు అదానీ ట్రస్టు కూడా ముందుకు వచ్చిందని ముఖ్యమంత్రి వివరించారు.

**జువ్వలదిన్నెపై దుష్ప్రచారం**

ఉదయగిరి నియోజకవర్గం వింజమూరు పాతచెరువుకు సోమశిల కాలువ నుంచి నీటిని తరలించేందుకు రూ.34 కోట్లతో పనులు చేపడతామని దీనిపై తక్షణం ఆదేశాలు జారీ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ఏడాది అక్టోబరు నాటికి చెరువును నింపుతామని భరోసా ఇచ్చారు. నీటి భద్రత కోసం స్థానిక వింజమూరు ప్రజలు వేసిన ఒక్క అడుగుకు ప్రజా ప్రభుత్వం వంద అడుగులు ముందుకు వేసి తోడుగా నిలబడుతుందన్నారు. రూ.70 లక్షల వ్యయంతో చెరువును పునరుద్దరణకు తీసుకున్న చొరవను ముఖ్యమంత్రి అభినందించారు. నీటి సంరక్షణ కోసం ప్రజలు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.



**ఇక పారిశ్రామిక అభివృద్ధే**

నెల్లూరు జిల్లాలో పెద్ద ఎత్తున పారిశ్రామిక అభివృద్ధి జరుగుతోందని .. రామాయపట్నం పోర్టు, దుగరాజపట్నం షిప్ బిల్డింగ్ సెంటర్ తో పాటు రక్షణ పరికరాలు, మానవ రహిత విమానాలు తయారవుతాయని .. ఇఫ్కో సెజ్ లో ఏర్పాటు కానున్న సౌర ఫలకాల తయారీ సహా వేర్వేరు పరిశ్రమల ద్వారా 80 వేల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని 2018 లోనే కేంద్రానికి లేఖ రాసి ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేసినట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. రూ.285 కోట్లతో దీని నిర్మాణం చేపట్టామని.. దీనిని వక్రీకరించి కొందరు హిట్ అండ్ రన్ నేరాల రాజకీయం చేస్తున్నారని సీఎం ఆక్షేపించారు.

**గతం అంతా అరాచకమే**

2019-24 మధ్య జరిగిన అరాచక, విధ్వంస పాలన కొనసాగిందని అలాంటి వ్యక్తిని తన జీవితంలో చూడలేదని ముఖ్యమంత్రి అన్నారు. కూటమి పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఎవరూ మత్స్యకారులకు అన్యాయం చేసే పరిస్థితి ఉండదన్నారు. తమిళనాడు నుంచి వచ్చే మత్స్యకారులు ఎవరూ మన జలాల్లో చేపల వేట చేయకుండా నిఘా పెట్టాలని నెల్లూరు, తిరుపతి కలెక్టర్లను సీఎం వేదిక నుంచి ఆదేశించారు.

# దోచుకోవడానికే అమరావతి ప్లాన్

**మొదటిపేజీ తరువాయి**

ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై జగన్ నిప్పులు చెరిగారు. గత వారం శాసనసభలో అమరావతిపై ప్రవేశపెట్టిన తీర్మానం కేవలం ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నమని జగన్ విమర్శించారు. అసలు రాజ్యాంగంలో రాష్ట్రానికి 'రాజధాని' అనే పదమే లేదని, కేవలం దేశానికి మాత్రమే రాజధాని ఉంటుందని స్వయంగా మంత్రి పార్థసారధి చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా రాజధాని అనేది రాష్ట్రాల ఇష్టమని హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిందని, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు తమ రాజధానులను తామే నిర్ణయించుకున్నాయని తెలిపారు. అలాంటప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఈ తీర్మానాల పేరుతో ఎందుకు డ్రామాలు ఆడుతోందని జగన్ ప్రశ్నించారు. అమరావతి నిర్మాణ వ్యయంపై జగన్ పలు ఆసక్తికరమైన ప్రశ్నలు సంధించారు. గతంలో 50 వేల ఎకరాల్లో మౌలిక సదుపాయాలకు లక్ష కోట్లు అవుతుందని చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు అదనంగా మరో 50 వేల ఎకరాలు ఎందుకు అడుగుతున్నారని నిలదీశారు. చదరపు అడుగుకు రూ. 11 వేల నుండి రూ. 14 వేల వరకు ఖర్చు అవుతుందని చెప్పడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందని ఆయన ఆరోపించారు. ఏ స్కాములు లేకపోతే అంత ఖర్చు ఎందుకు అవుతుంది? అభివృద్ధికి అవసరమైన రెండు లక్షల కోట్లు ఎక్కడి నుండి వస్తాయి? ఈ ప్రాజెక్ట్ ఎన్నేళ్లకు పూర్తవుతుందని ఆయన ప్రశ్నించారు. ఐదున్నర గంటల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఇలాంటి కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, కేవలం తనను , వైసీపీని దూషించడానికే సభను వాడుకున్నారని జగన్ మండిపడ్డారు. ఒకవైపు అసెంబ్లీని పిలిచిన ప్రభుత్వం, అదే చట్టసభలో భాగమైన కౌన్సిల్‌ను ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. కౌన్సిల్‌లో చంద్రబాబు అవినీతిని సభ్యులు కడిగిపారేస్తారనే భయంతోనే బాబు ఈ నిర్ణయం తీసుకున్నారని ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో ఎవరూ రాజధానిని మార్చకుండా చట్టం తెస్తామన్న చంద్రబాబు వ్యాఖ్యలపై జగన్ స్పందిస్తూ.. అసెంబ్లీలో చట్టసవరణలు చేసే అధికారం సభకు ఉంటుందన్న విషయం బాబుకు తెలియదా అని ప్రశ్నించారు. తన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల్లో సానుభూతి పొందడానికే చంద్రబాబు ఇటువంటి విన్యాసాలు చేస్తున్నారని, ఆయన అసలు రంగు ప్రజలందరికీ తెలుసని జగన్ స్పష్టం చేశారు. అమరావతి విషయంలో చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును తప్పుబడుతూ జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాత్రం రాజధాని అమరావతిపై మరోసారి అక్కసు వెళ్లగక్కారు. పార్లమెంట్‌లో రాజధాని అమరావతిపై కీలక చర్చ జరిగే సమయంలో తాడేపల్లి ప్యాలెస్‌లో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మావిగన్ ప్లాన్-బి అంటూ ఏపీ రాజధానిపై మరోసారి జగన్ గందరగోళ ప్రకటన చేశారు. ఏపీ కోసం ప్రాక్టికల్‌గా ఆలోచించే వారికి మాత్రమే తాను చెప్పేది అర్థమవుతుందని అన్నారు. ప్లాన్-బి ప్రకారం విజయవాడ, మచిలీపట్నం, గుంటూరు ప్రాంతాలను కలిపి రాజధాని చేయాలని జగన్ అన్నారు. దీనికి మావిగన్ అని పేరు పెట్టాలన్నారు. అమరావతికి పెట్టే రూ.2 లక్షల కోట్లలో 10 శాతం పెడితే మావిగన్ భవిష్యత్తులో మంచి నగరం అవుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును తప్పుపట్టారు వైసీపీ అధినేత. రాష్ట్ర రాజధాని అనేది పూర్తిగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అంశమని చెప్పుకొచ్చారు.

# విద్యాశాఖపై లోకేశ్ సమీక్ష...

**మొదటిపేజీ తరువాయి**

ఆయన సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని, కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. అదే సమయంలో, అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా 9వ తరగతి విద్యార్థులకు క్లిక్కర్ ఆధారిత విధానాన్ని అమలు చేయాలని కీలక నిర్ణయం తీసుకున్నారు.

**మధ్యాహ్న భోజనం, లీప్ యాప్‌పై దృష్టి**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతపై మంత్రి లోకేశ్ ప్రధానంగా దృష్టి సారించారు. ఈ విషయంలో ఎలాంటి ఫిర్యాదులకు తావివ్వకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, సోమవారం నుంచి లీప్ యాప్ ద్వారా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరిస్తున్నామని మంత్రికి వివరించారు. మంగళవారం నాటికి 6,719 పాఠశాలల నుంచి అభిప్రాయాలు సేకరించినట్లు తెలిపారు. ఈ ఫీడ్‌బ్యాక్ సేకరణ ప్రక్రియను పూర్తిగా ఆటోమేషన్ చేయాలని లోకేశ్ ఆదేశించారు. లీప్ యాప్ వినియోగంపై తల్లిదండ్రుల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల పాత్ర చాలా కీలకమని, అభ్యసన ఫలితాల మెరుగుదలలో వారిని భాగస్వాములను చేయాలని అభిప్రాయపడ్డారు.

**క్లిక్కర్ విధానం, స్టూడెంట్ కిట్లపై సమీక్ష**

నూతన సాంకేతికతను విద్యారంగంలో వినియోగించడంపై సమావేశంలో చర్చించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న క్లిక్కర్ ఆధారిత పునశ్చరణ విధానంపై తల్లిదండ్రుల నుంచి సానుకూల స్పందన వస్తోందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన లోకేశ్, తొలుత రాష్ట్రవ్యాప్తంగా 9వ తరగతి విద్యార్థులందరికీ ఈ విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత దశలవారీగా ఇతర తరగతులకు విస్తరించాలని సూచించారు. మరోవైపు, ఇరాన్ యుద్ధం కారణంగా పెట్రోలియం ఆధారిత ఉత్పత్తుల లభ్యత తగ్గడంతో స్టూడెంట్ కిట్లపై ప్రభావం పడుతోందని అధికారులు వివరించారు. అయితే, విద్యార్థి మిత్ర కిట్ల నాణ్యత విషయంలో పూర్తిస్థాయిలో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు.

**ఆటిజం సెంటర్లు, ఖాళీల భర్తీ**

సమాజంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని లోకేశ్ తెలిపారు. ఇందులో భాగంగా ఆటిజం సపోర్ట్ సెంటర్ల ఏర్పాటుపై సమీక్షించారు. ఫేజ్-1 కింద చినకాకాని, బాపట్లలో నిర్మాణం పూర్తయిన కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని నిర్ణయించారు. ఫేజ్-2 కింద ఈ ఏడాది జూన్ నాటికి 28 కేంద్రాలు, నవంబర్ నాటికి 95 కేంద్రాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు వివరించారు. ఈ కేంద్రాల నిర్వహణకు నిమ్హాన్స్ (చీ×వీనూచీూ) వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల సహకారంతో మానసిక వైద్యులు, కౌన్సిలర్లకు శిక్షణ ఇప్పించాలని మంత్రి ఆదేశించారు. కేజీబీవీ అడ్మిషన్లు, 1095 బోధనేతర, 277 బోధన సిబ్బంది నియామక ప్రక్రియలపైనా సమావేశంలో చర్చించారు.

# వసతి గృహాల్లో ఆహారంలో నాణ్యత లేకపోతే కఠిన చర్యలు తప్పవు.

**పట్టుదలతో కష్టపడి చదవండి.**

**బాల్య వివాహాలు వద్దు:స్థిరత్వం సాధించిన తర్వాతే వివాహాలు చేసుకోవాలి.**

**..జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, ఏప్రిల్ 01:**
వసతి గృహాల్లో విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యత లేకపోతే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు.
బుధవారం గోనెగండ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల వెనుకబడిన సంక్షేమ శాఖ వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో స్టోర్ రూమ్ లో కూరగాయలు, ఆహారపదార్థాలను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థినులతో ముచ్చటించి, విద్యా బోధన, భోజనం,బాల్య వివాహాలు తదితర అంశాలపై మాట్లాడారు. విద్యార్థి దశ అనేది జీవితానికి పునాది వంటిదని, ఈ దశలోనే ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన దిశగా కృషి చేస్తే భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకోవచ్చని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి పేర్కొన్నారు.
మొదటగా స్టోర్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. ఎండిపోయిన పచ్చిమిర్చి కనిపించడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఆహార పదార్థాల నాణ్యతలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సంబంధిత అధికారులను ఆదేశించారు. వసతి గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.భోజనం, విద్య,వసతి తదితర అంశాలపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ చేస్తోందని, అధికారులు ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.
అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. మెనూ ప్రకారం భోజనం అందుతోందా, ఆహారం నాణ్యత ఎలా ఉంది, సరిపడా ఇస్తున్నారా అని ఆరా తీశారు. వారానికి ఎన్ని గుడ్లు అందిస్తున్నారు , చిక్కీలు వంటి పోషకాహారం అందుతున్నాయా అనే విషయాలను అడిగి కూడా తెలుసుకున్నారు. త్రాగునీటి వసతి, టాయిలెట్ల పరిశుభ్రత, వసతి గృహంలో ఇతర సౌకర్యాలపై విద్యార్థులను ప్రశ్నించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.. అలాగే బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తూ, ఎక్కడైనా అలాంటివి గమనించినట్లయితే వెంటనే ఉపాధ్యాయులు లేదా వార్డెన్ కు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. బాల్య వివాహాలు వద్దని, జీవితంలో స్థిరత్వం సాధించిన తర్వాతే వివాహం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు జీవితంలో ఎదురయ్యే కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని పరిష్కరించుకోవాలని, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి చదువుపై పూర్తి దృష్టి పెట్టాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడి చదవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని కలెక్టర్ ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి రాధిక, బిసి వెల్ఫేర్ అధికారి ప్రసూన, ఎంపీడీవో మణి మంజరి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధికి పరిశ్రమలే ముఖ్యం.

**ఎం ఎస్ ఎం ఈ పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించాలి.**

**తలసరి ఆదాయం పెంపు లక్ష్యంగా పని చేయాలి. -..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**




**ఆంధ్ర ప్రగతి కర్నూలు, ఏప్రిల్ 01:**
జిల్లా అభివృద్ధికి పరిశ్రమలే పునాది అని, తలసరి ఆదాయం పెంచేందుకు పరిశ్రమల స్థాపనకు ప్రోత్సహించాలనిజిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు.బుధవారం కలెక్టరేట్ మిని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం క్రింద రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పరిశ్రమల ప్రోత్సాహకాన్ని వినియోగించుకొని మహిళలు, ఎస్సీ, ఎస్టీలు పరిశ్రమలు స్థాపించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. తలసరి ఆదాయాన్ని పెంచడం అత్యంత ముఖ్యమని, ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ సూచించారు.
కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పి.యం విశ్వకర్మ పథకంలో పురోగతి సాధించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. కర్నూలు జిల్లా నీటి వనరులు తక్కువగా ఉండటం, అక్షరాస్యత శాతం కూడా తక్కువగా ఉండటం వంటి సమస్యలను అధిగమించేందుకు ప్రతి శాఖ తమ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. జిల్లా పరిస్థితులను మెరుగుపరచడానికి అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సంబంధించి మొత్తం 35 ఎంఓయూలు కుదిరాయని, అందులో 11 యూనిట్లు గ్రౌండింగ్ పూర్తిచేసి నిర్మాణ దశలో ఉన్నాయని, 15 యూనిట్ల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని తెలిపారు.
పరిశ్రమలకు ఇచ్చిన ప్రోత్సాహం:-
జిల్లా లో పరిశ్రమల ప్రోత్సాహం (ఇన్సెంటివ్) కింద 12 సంస్థలకు ఇన్వెస్ట్మెంట్ సబ్సిడీ క్రింద 4 సంస్థలకు రూ 49,91,306 లు , పవర్ కాస్ట్ రియంబర్స్మెంట్ కింద 8 సంస్థలకు రూ 18, 96,830 లు మొత్తం 12 సంస్థలకు 68,88,136 రూపాయల ప్రోత్సాహం (ఇన్సెంటివ్) ఇవ్వడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

**ఆంధ్రప్రదేశ్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ( ఏపీ సిడిపి) క్రింద ఎం ఎస్ ఎం ఈ పార్కుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయం**

ఆంధ్రప్రదేశ్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఏపీ సిడిపి క్రింద ఎం ఎస్ ఎం ఈ పార్కుల ఏర్పాటుకు జనరల్ కేటగిరి వారికి కోటి రూపాయలు నుండి 5 కోట్ల రూపాయలు విలువగల ప్రాజెక్టులకు 80 శాతం మరియు 5 కోట్ల నుండి 10 కోట్ల విలువ గల ప్రాజెక్టు లకు 70 శాతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందన్నారు. మిగిలిన పెట్టుబడి 20 శాతం మరియు 30 శాతం అసోసియేషన్ లు భరించుకోవాలన్నారు. స్పెషల్ కేటగిరీ క్రింద మహిళలు 50 శాతానికి పైగా ఉంటే మరియు ఎస్సీ, ఎస్టీకి చెందిన వారికి కోటి రూపాయలు నుండి 5 కోట్ల వరకు ప్రాజెక్టు విలువ కు 90 శాతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందని తెలిపారు. మిగిలిన మొత్తం సంస్థ ప్రతినిధులు 10 శాతం భరించాలని తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి ప్రభుత్వం ఇస్తున్న ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని, ఈ అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని పరిశ్రమల అధికారులను ఆదేశించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మరియు ఆధ్వర్యంలో జరిగే డిస్ట్రిక్ట్ లెవెల్ స్టీరింగ్ కమిటీ సమావేశానికి లేదా జనరల్ మేనేజర్ , డిస్టిక్ ఇండస్ట్రీస్ సెంటర్ లకు అప్లికేషన్లను పంపాలని కోరారు.
పెండింగ్‌లో ఉన్న పరిశ్రమల పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగి, ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని, అందుకోసం ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.
సమావేశంలో జిఎం ఇండస్ట్రీస్ అశోక్ కుమార్, కర్నూల్ మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ ,
ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి , పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి, నేడ్కాప్ డివో వీరేంద్ర, జెడి వ్యవసాయ శాఖ వరలక్ష్మి , ఏపీఎంఐపి పిడి సుధాకర్ , ఎల్డీఎం రామచంద్రరావు , మార్కెటింగ్ ఏడీ నారాయణమూర్తి, డి సి ఎల్ వెంకటేశ్వర్లు, జడ్.ఎం మధుసూదన్ , పరిశ్రమల శాఖ డిడి లు జవహర్ బాబు, డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాల పిల్లలు, అంగన్వాడీలు, పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించండి.





**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి పాణ్యం/నంద్యాల, ఏప్రిల్ 01:**
జిల్లాలో ప్రభుత్వ విద్యా, పోషణ సేవల నాణ్యతను మెరుగుపరచడమే లక్ష్యంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం పాణ్యం మండలంలో విస్తృతంగా పర్యటిస్తూ పలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సేవల అమలు తీరును సమీక్షిస్తూ సంబంధిత అధికారులకు కీలక సూచనలు జారీ చేశారు. మొదటగా సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక అవసరాల పిల్లల శిక్షణ కేంద్రం (భవిత సెంటర్)ను పరిశీలించిన కలెక్టర్, కేంద్రం పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం, పిల్లల హాజరు శాతం తక్కువగా ఉండడం, సరైన వసతులు లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు అనుకూలమైన వాతావరణం కల్పించడం, హాజరు శాతం పెంచడం, అవసరమైన అన్ని సౌకర్యాలను తక్షణం కల్పించాల్సిందిగా ఆదేశించారు. అలాగే ఐఈ రిసోర్స్ పర్సన్‌ల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని గట్టిగా ఆదేశించారు. అనంతరం పాణ్యం మండలంలోని అంగన్వాడి కేంద్రాలు (4, 5)ను పరిశీలించిన కలెక్టర్, పిల్లల హాజరు నమోదు విధానాన్ని సమీక్షించి హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. వంటగదిలోని ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి, ప్రభుత్వం నిర్దేశించిన మెనూను ఖచ్చితంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. కేంద్ర పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ, ముఖ్యంగా టాయిలెట్ల నిర్వహణలో నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తదుపరి పాణ్యం మండలంలోని ఎంపీ యుపిఎస్ ఉర్దూ పాఠశాలను పరిశీలించిన కలెక్టర్, మధ్యాహ్న భోజన పథకం అమలుపై సమగ్రంగా ఆరా తీశారు. సన్నబియ్యం సరఫరా జరుగుతోందా అనే అంశాన్ని అధికారులను అడిగి తెలుసుకుంటూ, విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని స్పష్టం చేశారు. అదేవిధంగా విద్యార్థుల హాజరు నమోదు విధానం, పాఠశాల పరిసరాల పరిశుభ్రతపై ఉపాధ్యాయులకు సూచనలు జారీ చేశారు. పిల్లల విద్య, ఆరోగ్యం, పోషణ అంశాలలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు కావడం ద్వారా ప్రజలకు పూర్తి స్థాయి లాభాలు అందేలా అధికారులు కట్టుబడి పనిచేయాలని సూచించారు. సంబంధిత విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని కలెక్టర్ ఆదేశించారు.

# లబ్ధిదారుల ముంగిటకే ఎన్టీఆర్ భరోసా.

**జిల్లాలో ఏప్రిల్ మాసంలో 2,35,692 మందికి రూ.104.18 కోట్ల రూపాయల పెన్షన్లు పంపిణీ.**

**..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**



**ఆంధ్ర ప్రగతి గోనెగండ్ల, ఏప్రిల్ 01:** లబ్ధిదారుల ముంగిటకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అందచేస్తూ, ఏప్రిల్ మాసంలో జిల్లాలో అర్హులైన 2 లక్షల 35 వేల 692 మంది లబ్ధిదారులకు రూ.104.18 కోట్లు పంపిణీ చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. బుధవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో భాగంగా గోనెగండ్ల మండలంలోని కైరవాడి గ్రామంలో అయ్యమ్మ కు వృద్ధాప్య పెన్షన్, నాగలక్ష్మి, రంగమ్మ లకు వితంతువు పెన్షన్, బోయ చిన్న సోమన్న, శ్రీ నిత్య, రహేలమ్మ లకు వైకల్య పెన్షన్ లను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులకు పెన్షన్ లను పంపిణీ చేస్తూ వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులతో, వికలాంగులతో కలెక్టర్ ఆత్మీయంగా మాట్లాడుతూ ఇంట్లో వారు ఎలా చూసుకుంటున్నారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పెన్షన్ ప్రతి నెల సరైన సమయానికి అందిస్తున్నారా, అని కలెక్టర్ ఆరా తీశారు. నాగలక్ష్మి కి వితంతువు పెన్షన్ అందచేస్తున్న సమయంలో కేవలం వ్యవసాయం మాత్రమే చేయడం కాకుండా పాడి పశువులను కూడా పెంచుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి కి సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డిఆర్డిఎ పిడి రమణారెడ్డి, గోనెగండ్ల తహసిల్దార్ రాజేశ్వరి, ఎంపిడిఓ మణి మంజరి, తదితరులు పాల్గొన్నారు.

## గాజులదిన్నె ప్రాజెక్ట్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, ఏప్రిల్ 01:** గోనెగండ్ల మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్ట్ ను బుధవారం జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ప్రాజెక్ట్ వద్ద సాగు నీటి సరఫరా పరిస్థితులు, నీటి సామర్థ్యం పెంపు పనుల పురోగతి, జలాశయం నీటి నిల్వ స్థాయి, సాగు కాల్వల నిర్వహణ పనులు, మరమ్మత్తులు తదితర అంశాల గురించి అధికారులతో ఆరా తీశారు.గాజుల దిన్నె ప్రాజెక్ట్ కు సంబంధించి కోడుమూరు నియోజకవర్గంలో కెనాల్స్ లైనింగ్,ఇతర మరమ్మతులకు రూ.2.66 కోట్లు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి ఆమోదించారని కలెక్టర్ తెలిపారు.. ఎక్కడెక్కడ ఈ పనులు చేపట్టాలి అనే అంశంపై కలెక్టర్ అధికారులతో చర్చించారు..ఇరిగేషన్ అధికారులు బాగా పని చేసి రైతులకు సహకరించాలని కలెక్టర్ సూచించారు.కార్యక్రమంలో గోనెగండ్ల తహసీల్దార్ రాజేశ్వరి, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ నంద్యాల విభాగం ఎన్నికలు..!

**-జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ హరినాథ్. -సెక్రటరీగా డాక్టర్ మహబూబ్ బాషా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 01:**నంద్యాల జిల్లా కేంద్రంలో గవర్నమెంట్ మెడికల్ కళాశాల పరిధిలో గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నంద్యాల విభాగం ఎన్నికల నిర్వహన. డాక్టర్ లోకేశ్వర్ రెడ్డి, డాక్టర్ వై.గంగన్న ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ హరినాథ్, జనరల్ సెక్రటరీగా డాక్టర్ ఎస్.మహబూబ్ బాషా, పూర్వ ఇన్చార్జి సూపరింటెంట్ ప్రభుత్వ సర్వజన వైద్యశాల, అనస్థీషియా అసిస్టెంట్ ప్రొఫెసర్ లతో పాటు జిల్లా ఉపాధ్యక్షులుగా డాక్టర్ విజయ కుమారి, డాక్టర్ ఎం.సాయి కృష్ణ, డాక్టర్ జె.సూర్య నారాయణ, జాయింట్ సెక్రటరీలుగా డాక్టర్ మొహమ్మద్ రఫీ, డాక్టర్ మన్సూర్ బాషా షేక్, డాక్టర్ రజిని, కోశాధికారిగా డాక్టర్ ఎ.ఎస్. కె.నిరంజన్, కార్యనిర్వాహక సభ్యులుగా డాక్టర్ జి.సుధారాణి, డాక్టర్ శ్రీవల్లి, డాక్టర్ అనిల్ కరణం, డాక్టర్ జయశ్రీ, డాక్టర్ యు.శారద, డాక్టర్ కె.అరుణ జ్యోతి, జనరల్ కౌన్సిల్ సభ్యులుగా డాక్టర్ ఎస్.ఆంజనేయ వరప్రసాద్, డాక్టర్ బి.వి.ఎన్ మురళీధర్ రెడ్డి, డాక్టర్ టి.బాలాజీ లను అసోసియేషన్ సభ్యులు ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గవర్నమెంట్ డాక్టర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ఉపాధ్యక్ష జనరల్ సెక్రటరీ, సెక్రటరీ తదితర స్థానాలకు ఎన్నికైన అభ్యర్థులకు గవర్నమెంట్ డాక్టర్ అసోసియేషన్ సభ్యులు శుభాభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు.

# ఏప్రిల్ 4న లక్ష్మీనరసింహస్వామి నాగ ప్రతిష్ట ప్రథమ వార్షికోత్సవ వేడుకలు.



**ఆంధ్ర ప్రగతి రుద్రవరం ఏప్రిల్ 01:**
రుద్రవరం మండల పరిధిలోని నల్లమల అడవి ప్రాంతంలో కొలువైన శ్రీ దొర్వి చెంచు లక్ష్మీనరసింహస్వామి, నాగప్రతిష్ట ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఈనెల 4వ తేదీ శనివారం (04-04-2026) నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు మరియు ఆలయ సేవకులు ఒక ప్రకటనలో తెలిపారు. పరాభవ నామ సంవత్సర చైత్ర బహుళ విదియ నాడు స్వాతి నక్షత్రయుక్త శుభ ముహూర్తాన ఉదయం నుండే గణపతి పూజ, పుణ్యాహవచనము, స్వామివార్లకు పంచామృతాభిషేకములు, కలశ స్థాపన మరియు లోక కళ్యాణార్థం గణపతి, సుదర్శన, మహాలక్ష్మి హోమాలతో పాటు నవగ్రహ హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి మహా పూర్ణాహుతి, మంగళహారతులు ఇవ్వనున్నారు. ఈ ఆధ్యాత్మిక మహోత్సవం సందర్భంగా భక్తుల కోసం అన్నదానము మరియు వివిధ భజన బృందాలచే సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేశారు. కావున రుద్రవరం మండలంలోని భక్తులందరూ మరియు సమీప గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి, నల్లమల కొండల్లో వెలసిన ఆ నరసింహస్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి, స్వామివారి కృపకు పాత్రులు కావాలని రుద్రవరం గ్రామ ప్రజలు మరియు భక్తుల బృందం కోరుతున్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందజేస్తున్న కూటమి ప్రభుత్వం.

**ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేసిన రాష్ట్ర యువ నాయకుడు ఎన్ ఎండి.ఫయాజ్.**

**38వ వార్డు టిడిపి ఇన్చార్జి తాటికొండ బుగ్గ రాముడు.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 01:** నంద్యాల పట్టణం లోని 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ నందు వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు ఆధ్వర్యంలో ఏర్పాటు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి కుమారుడు రాష్ట్ర యువ నాయకుడు ఎన్ ఎండి.ఫయాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫయాజ్ మాట్లాడుతూ.. ప్రతినెల ఒకటవ తేదీన నిర్వహించే పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఈరోజు 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ నందు పాల్గొనడం జరిగింది అని ఆయన అన్నారు. మొట్టమొదటిసారిగా 200 రూపాయల పెన్షన్ నుండి 2000 రూపాయల వరకు అలాగే 2000 నుంచి 4000 వరకు పెన్షన్ మంజూరు చేసి అవతాతలకు,వికలాంగులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు నేనున్నానంటూ భరోసా ఇచ్చి శభాష్ అనిపించుకుంటున్న ఒక ఘనత కేవలం మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి దక్కుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, మరాఠీ సూరి,తాటికొండ మహేష్ బాబు,వడ్డే నాగేంద్ర,హిమామ్ హుస్సేన్,కల్కి రాఘవేంద్ర,కోటీశ్వరుడు, ప్రసాద్ రెడ్డి,సౌభాగ్యవతి, మల్లయ్య,జగన్,ఫిరోజ్, ఉమాకాంతయ్య,తదితర టీడీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రాయలసీమ విశ్వవిద్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం పెట్టాలి.



**ఆంధ్ర ప్రగతి కర్నూలు ఏప్రిల్ 01:** రాయలసీమ విశ్వవిద్యాలయం లో జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ఓబీసీ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి మల్లికార్జున యాదవ్ కోరారు. కర్నూలు మీడియా రూం ఆవరణలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెలలో జ్యోతిరావు పూలే జయంతి ఉన్నందున ఆలోపు రాయలసీమ యూనివర్సిటీ లో జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈవిషయంలో యూనివర్సిటీ ఉపకులపతి దృష్టికి తీసుకు వెళ్లిన ఇప్పటివరకు స్పందించ లేదన్నారు. ఎందరో బీసీ విద్యార్థులు చదువుతున్న యూనివర్సిటీ లో జ్యోతిరావు పూలే విగ్రహం లేకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టకుండా జన గణన నిర్వహించడం సరికాదన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న నియోజకవర్గం జరగాలంటే కేవలం కులగడం ద్వారానే సాధ్యమన్నారు. రిజర్వేషన్ల విషయంలోకుల గణన ఎంతో ముఖ్య మైనదన్నారు. అదేవిధంగా కర్నూల్ నగరపాలక సంస్థ కమిషనర్ బిసి అయినప్పటికీ కింద స్థాయి ఉద్యోగులను వేధించడం తోపాటు అనేక అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నాడని ఆరోపణలు వస్తున్నాయని ఆ అవినీతి అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా మంత్రి టీజీ భరత్ కమిషనర్ అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని ఆయనకు టీజీ భరత్ అండదండలు ఉన్నాయన్న ప్రచారం కూడా ఎక్కువగా జరుగుతుందని అటువంటి వాటిపై స్పందించి మంత్రి టీజీ భరత్ నగరపాలక సంస్థ కమిషనర్ పై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఆర్టీసీ బస్సులు ప్రమాదాలకు గురి అవుతున్న..

# జాగ్రత్తలు పాటించడం లేదు.

**ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలుస్తున్న**

**ఇక్కడ ఆర్టీసీ బస్సులు రోజు రాంగ్ రూటు లోనే ప్రయాణం.**








**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల ఏప్రిల్ 01:** నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిన 40జాతీయ రహదారిలో ప్రతిరోజు రాంగ్ గ్రూప్లో ప్రయాణిస్తూ ప్రయాణికుల రక్షణను గాలికి వదిలేసిన ఆర్టీసీ బస్సులు నంద్యాల జిల్లా సిరివెళ్ల మెట్ట 40వ జాతీయ రహదారి ప్రక్కన ఒక దాబా హోటల్లో ప్రతిరోజు ఆర్టీసీ డ్రైవర్ కండక్టర్లకు ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేయడంతో ప్రయాణికులను లెక్కచేయకుండా వారి సంక్షేమాన్ని ఆలోచించకుండా ప్రతిరోజు రాంగ్ రూట్లో ప్రయాణం చేస్తూ నిర్లక్ష్యం వహిస్తున్న సంఘటనలు సిరివెళ్ల మిట్ట వద్ద ప్రతిరోజు చోటు చేసుకుంటున్నాయి సిరివెళ్ల మెట్ట వద్ద ఒక ప్రైవేటు బస్సు ఒక లారీ ఢీకొని రెండు వాహనాలు అగ్నికి ఆహుతి కాగా సుమారు ముగ్గురు ప్రాణాలు కోల్పోయి 20 మంది తృటిలో బయటపడిన సంఘటన జరిగినప్పటికీ నిర్లక్ష్యపు మత్తు వీడడం లేదని పలువురు ఘాటుగా విమర్శిస్తున్నారు. రోడ్డు సేఫ్టీ అధికారులను పోలీసు యంత్రాంగాన్ని ట్రాఫిక్ కంట్రోల్ లను రోడ్డు నియమ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఆర్టీసీ బస్సులు రోజు రాంగ్ రూట్లో వెళ్లడం ఎంతవరకు సబబు అని పలువురు ప్రశ్నిస్తున్నారు ప్రభుత్వ యంత్రాంగం జిల్లా కలెక్టర్ గారు జిల్లా ఎస్పీ స్పందించి ఈ రాంగ్ రూట్లో వెళుతున్న బస్సులపై సీసీ కెమెరాలు ఆధారంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు సూచిస్తున్నారు.

# చోరీ కేసులో ఇద్దరు నిందితులు అరెస్ట్

**కర్నూలు డిఎస్పీ బాబు ప్రసాద్. - ..దొంగలించబడిన మొత్తం సొత్తు రికవరీ.**

**20 తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి ఆభరణాలు రికవరి చేసిన కర్నూలు పోలీసులు.**




**ఆంధ్ర ప్రగతి కర్నూలు క్రైమ్ ఏప్రిల్ 01:**
కర్నూల్ నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి లోని అమీన్ అబ్బాస్ నగర్ కు చెందిన వెంకట సుబ్బయ్య పేపర్ మిల్ లో పని చేస్తూ రిటైర్ అయ్యారు. ఒక కార్యం నిమిత్తం 2026 మార్చి 27 న న కడప కి వెళ్ళాడు. 2026 మార్చి 29 అర్ధ రాత్రి సమయం లో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వారి ఇంటి తాళాలు పగులకొట్టి ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించారు.

ఇంటిలోని బీరువా తాళాలు పగులగొట్టి అందులోని సుమారు 20 తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి ఆభరణాలు దొంగలించుకోపోయారన్న ఫిర్యాదు పై కర్నూలు నాల్గవ పట్టణ పోలీసు స్టేషన్ లో కేసు నమోదు పరిచారు. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కర్నూల్ డిఎస్పీ శ్రీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూలు నాల్గవ పట్టణ సిఐ విక్రమసింహ, కర్నూలు త్రీ టౌన్ శేషయ్య, ఎస్సై చంద్ర శేఖర్ రెడ్డి, క్రైమ్ పార్టీ పోలీసులు మురళీధర్, సుబ్బారాయుడు, వాసు, సుంకన్న, చెంచన్న, శేఖర్ లు ప్రత్యేక బృందాలుగా ఏర్ప డ్డారు.దర్యాప్తులో భాగంగా అందుబాటులో ఉన్న సీసీటీవీ ఫుటేజ్ లను పరిశీలించారు.

దొంగతనానికి పాల్పడిన నిందితులు బాలాజీ నగర్ లో నివాసముండే ఇద్దరు మైనర్ లుగా గుర్తించారు.

ఈ రోజు ఉదయం మునగాలపాడు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద వారిని అరెస్ట్ చేెశారు. వారి నుండి దొంగతనం చేయబడిన మొత్తం సొత్తును రికవరీ చేసి వారిని జువైనల్ జస్టిస్ బోర్డు ముందు హాజరు పెట్టడమైనది.
వీరు గతం లో కర్నూల్ 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి లో గణేష్ నగర్ నందు ఆర్టీసీ డిఎం వారి ఇంట్లో కూడా దొంగతనానికి పాల్పడ్డారు.

**ప్రజలకు ముఖ్య గమనిక**

ఎండాకాలం అని ఇంటికి తాళాలు వేసి ఆరుబయట /ఇంటి మీద పడుకొనే వారు, బయటి ప్రాంతాలకు వెళ్ళేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మన అజాగ్రత్త దొంగలకు ఆదాయం వనరు అని, అప్రమత్తంగా ఉండాలని కర్నూలు డిఎస్పీ శ్రీ జె. బాబు ప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ.

**సేవల మెరుగుదలకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు.**







**ఆంధ్ర ప్రగతి పాణ్యం/నంద్యాల, ఏప్రిల్ 01:**
జిల్లాలో ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవల నాణ్యతను మరింత మెరుగు పరచాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం పాణ్యం మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో అందిస్తున్న సేవలు, ప్రజలకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, సేవల అందించే సమయం, ప్రజల సంతృప్తి స్థాయి వంటి అంశాలపై కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. సేవలలో పారదర్శకత, వేగం, ప్రజలకు సులభతరం కావడం వంటి అంశాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.తనిఖీ సమయంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో ఉన్న డాక్యుమెంట్ రైటర్లు జిల్లా కలెక్టర్ గారిని గమనించగానే తమ దుకాణాలను వదిలి వెళ్లిపోవడం గమనించిన ఆమె, దీనిని తీవ్రంగా పరిగణించారు. అనుమతులు, నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్నట్లు అనుమానాస్పదంగా ఉన్న సంబంధిత దుకాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అవసరమైన చట్టపరమైన చర్యలలో భాగంగా ఆయా దుకాణాలను సీజ్ చేయించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలలో నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి కార్యకలాపాలు జరగకూడదని, ప్రజలను తప్పుదారి పట్టించే చర్యలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఉండదని స్పష్టం చేశారు. ప్రతి శాఖలోనూ పారదర్శకత, బాధ్యతాయుత వ్యవహారం తప్పనిసరిగా ఉండాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా అధికారులు పని చేయాలని ఆమె సూచించారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు వేగంగా, నిష్పక్షపాతంగా అందేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజా అభిప్రాయాన్ని మెరుగుపరచాలి.

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 01:**
ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజల సంతృప్తిని ప్రధాన లక్ష్యంగా తీసుకొని జిల్లాలకు, అధికారులకు ర్యాంకింగ్‌లు ఇవ్వబడుతున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయం (పబ్లిక్ పర్సెప్షన్) పెంపుపై సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని సంక్షేమ పథకాలలో కనీసం 80 శాతం నుండి గరిష్టంగా 95 శాతం వరకు ప్రజా సంతృప్తి సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరిస్తున్నప్పటికీ ప్రజా సంతృప్తి స్థాయి ఎందుకు పెరగడం లేదని ప్రశ్నించారు. జిల్లాలోని వివిధ శాఖల పనితీరు, ఎకనామిక్ కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు నమోదు, శాఖల మధ్య సమన్వయం, డేటా నమోదు ఖచ్చితత్వం, లక్ష్యాల సాధనపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. కే పి ఐ ల నమోదు విషయంలో నిర్లక్ష్యం అస్సలు ఉండకూడదని, ప్రతి వివరాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. అన్ని శాఖలు 'ఏ' లేదా 'ఏ+' గ్రేడ్‌లు సాధించేలా కృషి చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ పనితీరును సమీక్షిస్తూ, రబీ వరి ఉత్పత్తిలో లక్ష్యాన్ని మించి సాధించారని, మొక్కజొన్న పంటలో కూడా మంచి ఫలితాలు వచ్చాయని, మినుముల ఉత్పత్తిలో లక్ష్యాన్ని చేరుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మామిడి దిగుబడులు ఏప్రిల్ నుండి జూన్ వరకు నమోదయ్యే నేపథ్యంలో వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగులో లక్ష్య సాధన ఉన్నప్పటికీ గ్రేడ్ తగ్గడం పట్ల కలెక్టర్ ప్రశ్నించారు. హార్టికల్చర్ పరిధిలో స్వీట్ ఆరెంజ్, టమోటా, బెండ, బీన్స్, అరటి, చెరకు వంటి పంటల ఉత్పత్తి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. సెరికల్చర్ విభాగం పట్టు గూళ్ల ఉత్పత్తిలో 'ఏ' గ్రేడ్ సాధించడం సంతోషకరమని అన్నారు. పశు సంవర్ధక శాఖలో పాలు, మాంసం ఉత్పత్తిలో లక్ష్యాలను మించి సాధించి 'ఊ+' గ్రేడ్ పొందడం అభినందనీయమని, గుడ్ల ఉత్పత్తిలో లోటును అధిగమించాలని సూచించారు. మత్స్యశాఖలో ఫిషింగ్, ఆక్వాకల్చర్ ఉత్పత్తి వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు.
విద్యుత్ ఉత్పత్తి, వినియోగంలో జిల్లా 'ఏ' మరియు 'ఏ+' గ్రేడ్‌లలో ఉందన్నారు. గనులు మరియు ఖనిజాల విభాగంలో సున్నపు రాయి వంటి ఖనిజాల ఉత్పత్తిని లక్ష్యాలకు మించి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించిన సూచికలను కూడా కే పి ఐ ల్లో భాగంగా పరిగణించాలని పేర్కొన్నారు. స్త్రీ–శిశు సంక్షేమం, పోషకాహార లోపం తగ్గింపు, ఏటీఎం ల సంఖ్య, నేరాల తగ్గింపు వంటి అంశాల డేటాను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. మెడికల్, హెల్త్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ వంటి విభాగాలు డేటా నమోదు ఆలస్యం చేయకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ప్రజాభిప్రాయం మెరుగుపరచడం, కే పి ఐ ల ఖచ్చితమైన నమోదు, డాక్యుమెంట్ల అప్‌లోడింగ్, వాట్సాప్ సేవల విస్తరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## అమరావతి రాజధాని ప్రకటించడంతో

# ప్రజలందరూ సంతోషంగా ఉన్నారు.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 01:**
ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ నంద్యాలలోని తెలుగుగంగా ఆఫీస్ లో మీడియా సమావేశంలో పాల్గొనడం జరిగింది. మొన్న జరిగిన అసెంబ్లీలో సీఎం చంద్రబాబు నాయుడు మన రాజధాని అమరావతి అని ప్రకటించిన విషయంపై ప్రజలందరూ చాలా సంతోషంగా ఉన్నారని, చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం ప్రజల కోసం కట్టుబడి ఉంటాడని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. 2014 2019 మధ్యలో సీఎం చంద్రబాబు నాయుడు గారు రాజధాని కోసమై 30 వేల ఎకరాలు ఆ రోజుల్లోనే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రైతులకు ఇవ్వడం జరిగిందని కానీ మళ్లీ టీడీపీ ప్రభుత్వం రాకపోవడంతో వైసిపి నాయకులు ఏదో చేస్తారులే అని అనుకుంటే మూడు రాజధానులు అంటూ మూడుముక్కల ఆట ఆడి ఎక్కడ ఏమి లేకుండా గాలికి వదిలేసిన వైసిపి నాయకులు అని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వ్యక్తం చేశారు.
మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలందరికీ కోసం ఒక నిర్ణయం తీసుకొని మనకంటూ ఒక రాజధాని ఉండాలని అమరావతిని డిసైడ్ చేయడం ప్రజలందరికీ చాలా సంతోషంగా ఉందని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. పేర్ని నాని మొన్న ఏదో ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు ఏమి చేశారు రోడ్లు అభివృద్ధి పనులు అంతకుమించి ఏం చేశారంటూ మాట్లాడుతున్నారు.
వైసీపీ ప్రభుత్వంలో మీరు ఏమి చేశారని నేను ప్రశ్నిస్తున్నాను, మాజీ మంత్రులు కేవలం మీరు మీ జగన్మోహన్ రెడ్డి చెప్పినట్లు సీఎం చంద్రబాబు నాయుడు ని లోకేష్ అన్నను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారిని తిట్టడమే పనిగా పెట్టుకున్నారు గాని అభివృద్ధి గురించి గానీ ప్రజల గురించి గానీ ఎన్నడూ ఎక్కడా కూడా మాట్లాడటం లేదని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. రైతుల కోసం నీటి గురించి అలాగే ప్రజలు పడే ఇబ్బందుల గురించి నిరుద్యోగ యువతీ యువతుల కోసం పరిశ్రమలు తీసుకురావడం గురించి కేవలం కూటమి ప్రభుత్వమే ముందుండి చేస్తున్నారు. కానీ గత వైసిపి ప్రభుత్వం లో ఎక్కడా కూడా అభివృద్ధి జరగలేదని తెలిపిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ విమర్శించారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# తెలంగాణ అమర్నాథ్..
# సలేశ్వరం యాత్ర ప్రారంభం..!







**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఏప్రిల్ 01:**
నల్లమల్ల అటవీ ప్రాంతంలో వెలసి భూలోకం లో అద్భుత ప్రాంతం గా చెప్పుకునే సలేశ్వర మల్లికార్జున స్వామి వారి ఆలయ చరిత్ర
తెలుగు రాష్ట్రాల అమరనాధ్ యాత్ర గా చెప్పుకునే సలేశ్వరం యాత్ర ఉగాది వెళ్లిన తొలి పౌర్ణమి సమయం లో కేవలం 5 రోజులు ( ఈ సంవత్సరం రానున్న ఏప్రిల్ 2 పౌర్ణమి నుండి ఏప్రిల్ 6 వరకు మాత్రమే) భక్తులు దర్శించుటకు వీలు కలిగే సలేశ్వర యాత్ర: శివుడు మల్లిఖార్జున స్వామి రూపంలో కీకారణ్యంలో వేలసంవత్సరాల క్రితం వెలసిన క్షేత్రం సలేశ్వరం: అలనాటి నిజాం నవాబ్ లు సలేశ్వర ప్రాంత అద్భుత అందాలకు బందీ అయి ఆ ప్రాంతంలో వేసవి విడిది ఏర్పాటు: మన పల్నాడు ప్రాంత విజయపురి ని పాలించిన ఇక్ష్వాకుల పరిపాలనలో సలేశ్వర ప్రాంత ఆనవాళ్లు లభ్యం: రానున్న పౌర్ణమి ఏప్రిల్ 2 వ తేదిన లక్షల మంది భక్తులు దర్శించే సలేశ్వర యాత్ర విశేషాలు తెలుసుకుందాం:
హైదరాబాద్ నుండి శ్రీశైలం వచ్చే మార్గంలో నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలం మన్ననూరు ,అచ్చంపేట గ్రామాల అటవీ ప్రాంతం లో సలేశ్వర మల్లిఖార్జున స్వామి వెలిసారు.చుట్టూ కొండలు ఉండటం వలన శైలాలు(కొండలు) పేరు మీదుగా మొదట శైలేశ్వరం అని కాలక్రమేణా వాడుక భాష లో ప్రజలు సలేశ్వరం గా ఈ ప్రాంతాన్ని పిలవటం మొదలయింది. శివదేవుడు ప్రకృతి ప్రేమికుడు,ధ్యాన సంపన్నుడు కావటం వలన ఆయన వెలసిన క్షేత్రాలన్ని దట్టమైన అడవులు,కొండలు,జలపాతాలు,ప్రశాంత వాతావరణం లోనే వెలుస్తారు.ఉదాహరణకు శ్రీశైలం, ఉమామహేశ్వరం,లొద్ది మల్లయ్య,కోటప్ప కొండ ఇలా అనేకం చెప్పుకోవచ్చు.సలేశ్వర యాత్ర అతి కఠిన తరమైనది కావున తెలుగు రాష్ట్రాల అమర్ నాధ్ యాత్ర గా పేరుపొందింది. హైదరాబాద్ నుండి శ్రీశైలం వచ్చే మార్గ మధ్యలో మన్ననూర్ అటవీ ప్రాంతంలో 150 వ మైలు రాయి వద్ద నుండి అటవీ మార్గం ద్వారా 15 కిలోమీటర్లు వాహనాలు పై ప్రయాణిస్తే సలేశ్వరం కు వెళ్లే మార్గం కు చేరుకుంటాము,ఈ 18 కిలో మీటర్లు కూడా క్లిష్టమైన అటవీ ప్రాంతం,మట్టిరోడ్డు కావటం మరియు సింగిల్ రోడ్డు వల్ల 18 కిలోమీటర్లు చేరుకోవటానికి 4 నుంచి 5గంటల సమయం పడుతుంది,శ్రీశైలం నుండి తిరిగి హైదరాబాదు వెళ్లే మార్గం లో సరిగ్గా 60 కిలోమీటర్లు ప్రయాణిస్తే మన్ననూరు వస్తుంది. ఇది దట్టమైన కీకారణ్య ప్రాంతం కావున అటవీ శాఖ అధీనంలో ఉంటుంది.కేవలం చైత్ర శుద్ధ త్రయోదశి నుండి చైత్ర బహుళ విదియ వరకు మాత్రమే 5 రోజులు స్వామి వారి వార్షిక ఉత్సవాల సమయంలో మాత్రమే భక్తులను ఆలయం వరకు అనుమతిస్తారు.మిగిలిన రోజుల్లో ఈ ఆలయం కు వెళ్లటం అసాధ్యం. అద్భుత మైన ప్రకృతి,ఆకాశం తాకే కొండలు,వాటి కిందనుండి పై వరకు పచ్చని చెట్లు,గుహలు,జలపాతాలు ఈ ప్రాంతం సొంతం,అందుకే 17 వ శతాబ్దం లో అలనాటి నిజాం నవాబ్ అటవీ సంచారానికి వచ్చి ఈ ప్రాంత ప్రకృతి సౌందర్యానికి ముగ్దుడు అయ్యి ఆ రోజుల్లోనే ఈ ప్రాంతంలో వేసవి విడిది పర్హాబాద్ పేరుతో భవనం నిర్మించుకున్నారు. వేసవి లో ఈ ప్రాంతానికి వచ్చి ప్రకృతి సౌందర్యానికి పరవశించి పోయేవారట నాటి నిజాం పాలకులు.నిజాం వేసవి విడిది ప్రస్తుత శిధిల ఆనవాళ్లు ఈ మార్గంలో మనం చూడవచ్చు. అడవిలో 18 కిలోమీటర్లు వాహనాలపై ప్రయాణించాక వాహనాలు అక్కడ నిలిపి తమకు అవసరమైన దుస్తులు,ఆహార పదార్థాల వంటివి మాత్రమే తీసుకుని కాలి నడకన 5 కిలోమీటర్లు నడవాలి. ఈ మార్గం కొండలు,ఇరుకైన ప్రాంతాలు,అతి క్లిష్టమైన సన్నని రోడ్లు కలిగి ఉంటుంది,అలా కొంత దూరం వెళ్ళాక రెండు కొండల మధ్య ఒక వాగు ప్రవాహంకలిగి ఉంటుంది. ఆ కొండలను పట్టుకుని అతి జాగ్రత్తగా అడుగులో ,అడుగు వేస్తూ ఆ వాగు దాటాలి,ఏ మాత్రం కాలు జారినా వాగు ప్రవాహం లో పడిపోతారు. ఈ క్లిష్టమైన మార్గాన్ని దాటేటప్పుడు వస్తున్నాం శివయ్యా నీ వద్దకు వస్తున్నాం అంటూ భక్తులు అందరూ లయబద్ధంగా అనుకుంటూ దాటటం జరుగుతుంది.శివయ్య రక్షగా ఎవరికి ఏ మాత్రం అపాయం లేకుండా ఈ రెండు కొండల నడుమ ప్రవహించే జలపాతం దాటుతారు.ఇది దాటాక దాదాపు 200 అడుగులు లోతు గా ఉండే మోకాళ్ల కూర్వం గా పిలవబడే ప్రాంతం నుండి కిందకు అతి కష్టంగా దిగాలి,ఇలా కిందకు దిగే సమయంలో ప్రతి ఒక్కరు చేతి కర్రను ఊతంగా వాడుతారు,కొందరు కూర్చుని నెమ్మదిగా దిగుతారు.ఈ మార్గం దాదాపు 2 కిలోమీటర్లు వరకు ఉంటుంది. ఇలా జాగ్రత్తగా నడుస్తూ కొంత దూరం చేరుకున్నాక సలేశ్వర మల్లిఖార్జున స్వామి వారి ఆలయం కు చేరుకుంటాము,ఆలయ ప్రాంతం లో పచ్చని ప్రకృతి,ఆధ్యాత్మిక వాతావరణం చూస్తే పడిన శ్రమ భక్తులు మరచిపోతారు.ఈ ప్రాంతంలో కొండలను ఎవరో చక్కటి ఆకృతి తో చెక్కినట్లు వాటి పై అందమైన వృక్షాలు నాటినట్లు అద్భుతంగా కనిపిస్తాయి.స్వామి ఆలయం కు ముఖ మండపం ఉండదు. ఒక గుహలో వెలసినట్లు గా ఉండే మల్లికార్జున స్వామి వారిని దర్శించి భక్తులు పులకించిపోతారు,స్వామి వారికి స్వయంగా అభిషేకం చేయవచ్చు, ఈ అలయం లో అటవీ ప్రాంతంలో నివశించే గిరిజన చెంచు సోదరులే పూజారుల గా వ్యవహరిస్తారు,పండితులు,పూజారులు వలె శాస్త్రోక్తంగా మంత్రోచ్చారణలు కాక వారికి నచ్చిన రీతిలో స్వామిని కొలుస్తారు. పరమ శివుడు భోళా శంకరుడు భక్తితో చెంబుడు నీళ్లతో అభిషేకిస్తే మురిసిపోయి భక్తులను కన్న బిడ్డలు గా చూస్తారని చారిత్రక కథనాలు అనేకం ఉన్నాయి కదా,అటవీ ప్రాంతంలో సంచరిస్తూ వేటగాడి గా జీవించే గిరిజన పుత్రుడు భక్త కన్నప్ప మాంసం తెచ్చి ఇచ్చినా కాదనకుండా మోక్షమిచ్చిన దేవుడు,ఏ శాస్త్రాలు తెలియకున్నా నమ్మి కొలిచిన సర్పం,ఏనుగు,సాలీడు కు మోక్షం ఇచ్చిన దక్షిణా మూర్తి.ఇదే స్ఫూర్తితో,భక్తితో ఇక్కడ చెంచులు స్వామి వారికి అటవీ లో దొరికే పుట్ట తేనె,పుష్పాలు తో పూజిస్తారు. మూర్తి.ఇదే స్ఫూర్తితో,భక్తితో ఇక్కడ చెంచులు స్వామి వారికి అటవీ లో దొరికే పుట్ట తేనె,పుష్పాలు తో పూజిస్తారు.ఈ ఆలయం లో చైత్ర శుద్ధ పౌర్ణమి (ఈ సంవత్సరం ఏప్రిల్ 2 నుంచి 6 వరకు ఈ యాత్రకు అనుమతిస్తారు ) రోజున చంద్రకిరణాలు ఏప్రిల్ 2 పౌర్ణమి రోజున నేరుగా స్వామి వారి పై ప్రసరించి తేజోమూర్తి అయిన లింగమూర్తి గా స్వామి దర్శన మిస్తారు,సంవత్సరం లో ఒక్కరోజున మాత్రమే ఇలా జరుగుతుంది,కనుకనే ఈ రోజున లక్షలాది భక్తులు స్వామి వారిని దర్శించి కృపపొందుతారు,ఈ అద్భుతం మాటల్లో,రాతల్లో వర్ణించలేము,చూసిన వారు మాత్రమే ఆ అనుభూతి పొందుతారు.ఈ రోజున స్వామి వారిని దర్శిస్తే సకలపాపాల హరణం పొంది సుఖ:శాంతులతో వర్ధిల్లుతారని చెపుతారు,అందుకే ఇంత క్లిష్టమైన మార్గం లో ప్రయాణించి స్వామి వారిని భక్తులు దర్శిస్తారు. ఆలయం లో విద్యుత్ సౌకర్యం ఉండదు,దీపాల కాంతి,చంద్రుని వెలుగు మాత్రమే ఉండి పరమ శివుడు నేరుగా దర్శనం ఇచ్చారా?అని భక్తులు పులకించేలా పౌర్ణమి రోజు ఉంటుంది. ఈ ఆలయానికి దగ్గరలో దాదాపు 200 అడుగుల పై నుండి జాలు వారే తెల్లని స్వచ్ఛమైన పాలధార లాంటి జలపాతం పడుతుంది,ఈ జలపాతం క్రింద స్నానమాచరించి స్వామిని దర్శిస్తారు. ఈ జలపాతం కింద స్నానమాచరిస్తే దీర్ఘకాలిక రోగాలు మాయం అవుతాయని భక్తుల నమ్మకం దట్టమైన అరణ్యం లో ఎన్నో ఔషధ మొక్కలు,ఆకులు ను తాకుతూ పై నుండి జాలు వారే జలం లో అనేక గుణాలు ఉండి రోగాలు నయం చేస్తాయని చెపుతారు. ఈ ప్రవాహం భక్తులు కొద్ది సంఖ్యలో వెళ్తే తక్కువ ధారతో ఎక్కువ సంఖ్యలో వెళ్తే పెద్ద ధారతో పై నుండి పడడం స్వామి లీల అని చెపుతారు. ఆలయం దగ్గరలో ఒక గుహలో కూడా పై నుండి జలపాతం పడుతూ అద్భుతంగా ఉంటుంది. ఆలయం కు దగ్గరలో గంగా మాత,కాలభైరవుడు,వీరభద్రస్వామి ఆలయాలతో పాటు స్వయంగా వెలసిన పుట్ట సుబ్రమణ్య స్వామి వారు కొన్ని వేల సంవత్సరాల కాలం నుండి ఉండే ఆలయాలు గా మనకు కనిపిస్తాయి.పుట్టకు దారాలు కట్టి పూజ చేస్తే సంతానం లేని వారికి సంతాన ఫలం అలాగే సొంత ఇళ్ళు లేని వారు స్వామిని మొక్కుకుంటే అతి త్వరలో ఇండ్లు కట్టుకునేలా దీవిస్తారని, అలా గృహాలు నిర్మించుకున్నవారు మరుసటి సంవత్సరం వచ్చి రాళ్ళు పేర్చి మొక్కులు తీర్చుకునటం మనం చూడవచ్చు. కొన్ని వేల సంవత్సరాల నాటి ఈ ఆలయ ప్రస్తావన 13 వ శతాబ్దంలో పండితారాధ్య చరిత్ర,శ్రీ పర్వత క్షేత్రం రాసిన ప్రముఖ శివ భక్త పండితుడు పాల్కురి సోమనాధుడు తన గ్రంధాలలో సలేశ్వర ఆలయ విశేషాలు తెలిపారు,దీనిని బట్టి ఎంత ప్రాసస్త్యం ఉన్న ఆలయమో మనం గ్రహించవచ్చు.17 వ శతాబ్దం లో శ్రీశైలం దర్శించిన చత్రపతి శివాజీ అడవుల గుండా ప్రయాణించి సలేశ్వరం చేరుకుని స్వామి వారికి ఆరాధించినట్లు చారిత్రక కథనాలు ఉన్నాయి. చేరుకుని స్వామి వారికి ఆరాధించినట్లు చారిత్రక కథనాలు ఉన్నాయి. వచ్చి బౌద్ధ మతం లో చేరిన జూలధమ్మగిరి సాధువులు గా భావించే కొందరు బౌద్ధులు సలేశ్వరం ప్రాంతంలో నివశించి తపస్సు చేసేవారట,అలాగే పూర్వకాలం లో మునీశ్వరులు ఈ ప్రశాంత వాతావరణం లో శివదేవుని పూజించారని కథనాలు ఉన్నాయి.సలేశ్వర ఆలయానికి దగ్గరలో అటవీ ప్రాంతంలో అధ్భుత మైన మల్లెల తీర్ధం అనే చారిత్రక జలపాతం ఉంటుంది.(మరో సారి మల్లెల తీర్ధం గురించి పూర్తి వివరాలు అందిస్తాను) పూర్వ కాల దివ్యర్షులు పరమశివుడు నల్లమల్ల అటవీ తీరంలో ప్రకృతి కి పరవశించి పంచ లింగాలు గా ఆవిర్భావించారని అవి 1.శ్రీశైలం. 2.ఉమా మహేశ్వరం. 3.లొద్ది మల్లయ్య4.సలేశ్వరం కాగా పంచమ లింగం ఇంతవరకు ఏ మానవుడు,దివ్యర్షి గాని కనిపెట్టలేకపోయారని చెపుతారు.దట్టమైన అరణ్యంలో పంచమ లింగం కూడా ఎక్కడో ఉండవచ్చని బహుశా అక్కడకు వెళ్లే మార్గం కూడా అసాధ్యం కావున ఇంతవరకు ఆనవాళ్లు కనబడలేదని చెపుతారు.ఎందరో ఋషులు,ఆధ్యాత్మిక పురుషులు,గిరిజనులు నల్లమల్లను జల్లెడ పట్టినా పంచమలింగ ఆధారం నేటికి లభించలేదట. ఈ మార్చి 31 కి సలేశ్వర యాత్ర కు తెలంగాణా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుంది.ట్రెక్కింగ్,సాహాసాలు చేసే వారికి ఈ ప్రాంతం అద్భుత ప్రపంచం లా తోస్తుంది,కొండల అంచులు,జలపాతాలు,దట్టమైన అడవీ, కొండలు దాటుతూ సలేశ్వర మల్లిఖార్జున స్వామిని దర్శించటం గొప్ప అనుభూతి,స్వామి వారిని దర్శించటానికి వెళ్లేటప్పుడు భక్తులు వస్తున్నాం శివయ్యా అంటూ,తిరిగి వచ్చేటప్పుడు వెళ్తున్నాం శివయ్యా అంటూ శివనామ స్మరణ తో సాగుతారు,ఇంతటి క్లిష్టమైన యాత్రలో శివుడు భక్తులకు అండగా ఉండి ఎటువంటి ప్రమాదాలు లేకుండా చేస్తారని భక్తులు చెపుతారు,అది నిజం. దట్టమైన కీకారణ్యంలో కొన్ని వేల సంవత్సరాలనాటి నుండి దివ్యర్షులు తో పూజలు అందుకుంటూ ఉన్న శివాలయ ఆనవాళ్లు ఉన్నాయంటే అది శివుని మహిమ కాక ఏమని చెప్పాలి?ఇప్పటికే ఆప్రాంతం కువెళ్లటం అసాధ్యం,సృష్టిలో దైవ లీలకు ఇటువంటి ఆధారాలే మనకు కీలకం గా చెప్పవచ్చు. నేటికి ప్రతి సంవత్సరం 5 రోజులు జరిగే ఉత్సవాలకు లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించి వెళ్లే ప్రక్రియలో ఎక్కడా ప్రమాదాలు జరిగిన సంఘటనలు లేవు,ఒక్కోసారి ఈ 5 రోజుల యాత్రలో గతం లో వర్షాలు సంభవించినను భక్తులకు హాని జరగలేదు అని చెపుతారు. ఈ సంవత్సరం సలేశ్వర మల్లిఖార్జుని యాత్ర కు వెళ్లే భక్తుల పై స్వామి వారి కృప ఉండాలని కోరుతూ,ఇంతటి గొప్ప చారిత్రక,ఆధ్యాత్మిక ఆనవాళ్లు ఉన్న సలేశ్వర స్వామి గురించి తెలియని వారికి తెలియచేసేలా నాకు సంకల్పం కలగచేసిన పరమశివుని ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుతున్నాను.

## వైభవంగా శాంతినికేతన్ ఛాంపియన్ స్టూడియో ప్రారంభం.!
## వార్షిక క్రీడా సంబరాలకు అంకురార్పణ.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 01:**నంద్యాల పట్టణం లోని క్రాంతి నగర్‌లోని ప్రముఖ విద్యాసంస్థ శ్రీ శాంతినికేతన్ సీబీఎస్ఈ స్కూల్ మంగళవారం సరికొత్త చరిత్రను లిఖించింది. పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన 'శాంతినికేతన్ ఛాంపియన్ స్టూడియో' ప్లే గ్రౌండ్‌ను ఘనంగా ప్రారంభించడంతో పాటు, విద్యార్థుల క్రీడా పండుగ వార్షిక క్రీడా దినోత్సవానికి వైభవంగా అంకురార్పణ చేశారు.
**ఉదయం: ఛాంపియన్ స్టూడియో ఆవిష్కరణ మరియు క్రీడా జ్యోతి ప్రజ్వలన**
మంగళవారం ఉదయం జరిగిన ప్రారంభోత్సవ వేడుకకు రామకృష్ణ డిగ్రీ మరియు పీజీ కళాశాల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. పాఠశాల చైర్మన్ శ్రీ సుధాకర్ మరియు పాఠశాల కరస్పాండెంట్ శ్రీమతి రమ్య రెడ్డి తో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేసి ఈ అత్యాధునిక 'ఛాంపియన్ స్టూడియో'ను ప్రారంభించారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి, వార్షిక క్రీడా దినోత్సవ పోటీలను అధికారికంగా ప్రారంభించారు.
**ఛాంపియన్ స్టూడియో ప్రత్యేకతలు:**
ప్రొ కబడ్డీ మ్యాట్స్: కబడ్డీ కోర్ట్‌లో ప్రొ కబడ్డీ లీగ్‌లో ఉపయోగించే అత్యాధునిక సింథటిక్ మ్యాట్స్‌ను ఏర్పాటు చేశారు. దీనివల్ల క్రీడాకారులకు గాయాలు కాకుండా ప్రొఫెషనల్ స్థాయిలో ఆడే అవకాశం లభిస్తుంది.సోలార్ ఫ్లడ్ లైట్లు: రాత్రి వేళల్లో కూడా క్రీడలు నిర్వహించుకునేలా మైదానం చుట్టూ అత్యాధునిక సోలార్ ఫ్లడ్ లైట్ల సౌకర్యం కల్పించారు.
అడ్వాన్స్డ్ కోర్టులు: ఈ స్టూడియోలో బాస్కెట్‌బాల్ కోర్ట్, టెన్నిస్ కోర్ట్ మరియు పికిల్ బాల్ కోర్ట్ వంటి ఆధునిక వసతులు ఏర్పాటు చేశారు.
**విద్యార్థుల కళా ప్రదర్శనల సందడి:**
ప్రారంభోత్సవం అనంతరం విద్యార్థులు నిర్వహించిన మార్చ్ పాస్ట్ చూపరులను ఆకట్టుకుంది. విద్యార్థులు ప్రదర్శించిన డమ్ బెల్ డాన్స్, కోలాటం, లెజిమ్ డాన్స్, స్టిక్ డాన్స్, ఫుట్‌బాల్ డాన్స్ మరియు కరాటే స్టంట్స్ సభికులను మంత్రముగ్ధులను చేశాయి. వారి క్రమశిక్షణ, నైపుణ్యాన్ని చూసి అతిథులు అభినందనలు కురిపించారు.
సాయంత్రం: ముగింపు వేడుక – విజేతలకు పురస్కారాలుసాయంత్రం జరిగిన వాలిడిక్టరీ సెర్మనీకి నంద్యాల జిల్లా విద్యాశాఖాధికారి శ్రీ పి. జనార్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన క్రీడా విజేతలకు పతకాలు అందజేయడంతో పాటు, ఐఐటి ఒలింపియాడ్ స్టేట్ ర్యాంకులను సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రత్యేక పురస్కారాలను అందజేశారు.ఈ సందర్భంగా డి.ఇ.ఓ సార్ మాట్లాడుతూ.. శ్రీ శాంతినికేతన్ స్కూల్ అటు అకాడమిక్స్‌లోనూ, ఇటు క్రీడల్లోనూ అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పించడం గర్వకారణమని ప్రశంసించారు. చైర్మన్ సుధాకర్ మరియు కరస్పాండెంట్ రమ్య రెడ్డి కృషిని ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం మరియు భారీ సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు. క్రాంతి నగర్ లోని స్కూల్ ప్రాంగణం విజయ గర్జనలతో మార్మోగిపోయింది.










## యుద్ధం ఎవరిది.. మూల్యం ఎవరిది..!

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఏప్రిల్ 01:**చరిత్ర పుటల్లో యుద్ధాలు ఎప్పుడూ రాజ్యాల గెలుపోటములను మాత్రమే రికార్డు చేస్తాయి. కానీ, ఆ గెలుపు వెనుక చితికిపోయిన సామాన్యుడి బతుకుని, ఆ ఓటమి వెనుక కాలిపోయిన సామాన్యుడి కలలను ఎవరూ లెక్కించరు..పాలకుల వ్యూహాలు, దేశాల ఆధిపత్య పోరాటాలు ప్రపంచ పటాన్ని మార్చవచ్చు కానీ, ఒక సామాన్య పౌరుడి జీవితంలో అవి మిగిల్చేది కేవలం అశాంతి మరియు ఆర్థిక భారమే. ప్రస్తుత ప్రపంచ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న మూడు భిన్నమైన దేశాల – అమెరికా, ఇరాన్, మరియు ఇజ్రాయిల్ – వాస్తవ పరిస్థితులను, వాటి వెనుక ఉన్న సామాన్యుడి కష్టాలను వివరిస్తూ సాగే ఈ విశ్లేషణ యుద్ధం పట్ల మన దృక్పథాన్ని ఆలోచింపచేయాలి.

**1 అమెరికా**

అమెరికా తనను తాను ప్రపంచానికి "భద్రతా రక్షకుడు"గా ప్రకటించుకుంటూ మిడిల్ ఈస్ట్‌లో దశాబ్దాలుగా జోక్యం చేసుకుంది. ఉగ్రవాద నిర్మూలన, ప్రజాస్వామ్యం అనే పేర్లతో చేసిన యుద్ధాలు మొదట్లో శక్తిని చూపించాయి. కానీ కాలక్రమంలో అవే అమెరికాకు భారంగా మారాయి.. అపారమైన ఆర్థిక ఖర్చులు, వేలాది సైనికుల ప్రాణనష్టం, అంతర్జాతీయంగా నమ్మకం తగ్గడం ఇవన్నీ అమెరికా ఎదుర్కొన్న వాస్తవాలు.
యుద్ధ నిర్ణయాలు తీసుకున్న ప్రభుత్వాలు మారిపోయాయి, కానీ ఆ అప్పుల భారం, సామాజిక విభజన, మానసిక గాయాలు మాత్రం అమెరికా సామాన్య ప్రజలకే మిగిలాయి. ప్రపంచాన్ని నియంత్రించాలన్న ఆశ చివరికి తనలోనే అస్థిరతను పెంచింది..

**2 ఇరాన్.**

ఇరాన్ ప్రత్యక్ష యుద్ధాలకంటే, హమాస్, హిజ్బుల్లా, హౌతీలు వంటి ప్రాక్సీ సంస్థలను ఉపయోగించి తన శత్రువులను ఎదుర్కొనే వ్యూహాన్ని ఎంచుకుంది..ఇది మొదట్లో రాజకీయంగా బలం తెచ్చినట్టు కనిపించింది "పాలస్తీన్ పరిరక్షకుడు" అనే ఇమేజ్, ప్రాంతీయ ప్రభావం..
కానీ దీర్ఘకాలంలో ఇదే వ్యూహం ఇరాన్‌ను తీవ్ర ఆంక్షలలోకి నెట్టింది. ఆర్థిక వ్యవస్థ క్షీణించింది, యువతలో నిరుద్యోగం పెరిగింది, ప్రజల్లో అసంతృప్తి బలపడింది..పాలకుల వ్యూహాలు విదేశాల్లో యుద్ధాలకు నిధులు పంపినా, దేశంలో ఉన్న సామాన్య ఇరానీ మాత్రం ధరల పెరుగుదల, జీవన కష్టాలతో రోజూ యుద్ధం చేస్తున్నాడు.. రాజకీయ లాభం పైవారికి, మూల్యం మాత్రం ప్రజలకు.

**3ఇజ్రాయిల్.**

ఇజ్రాయిల్ సైనికంగా బలమైన దేశమే అయినా, మానసికంగా మాత్రం ఎప్పుడూ యుద్ధ భయంతోనే జీవిస్తోంది.. చుట్టూ శత్రువులున్నాయనే భావన, నిరంతర భద్రతా ముప్పు ఇవి ఇజ్రాయిల్ ప్రజల రోజువారీ జీవితంలో భాగమయ్యాయి..
యుద్ధాలు, ప్రతిదాడులు తాత్కాలికంగా భద్రతను ఇచ్చినట్టు కనిపించినా, దీర్ఘకాలంలో ఆర్థిక ఒత్తిడి, అంతర్జాతీయ విమర్శలు, అంతర్గత విభజన పెరిగాయి..ఒక సాధారణ ఇజ్రాయిల్ పౌరుడు శక్తివంతమైన దేశంలో



ఉన్నా, ప్రశాంతమైన భవిష్యత్తుపై పూర్తి నమ్మకంతో జీవించలేని పరిస్థితి ఇదే..

**3.సారాంశం మూడు దేశాల అనుభవాల నుంచి వచ్చిన సత్యం**

ఈ మూడు దేశాలు వేర్వేరు సిద్ధాంతాలతో, వేర్వేరు శక్తులతో పోరాడాయి.
పాలకులు మారారు.
సరిహద్దులు కదిలాయి.
వ్యూహాలు మారాయి.
కానీ ప్రతి చోటా ఒకటే నిజం నిలిచింది.
యుద్ధాలు ఎవరి పేర్లతో జరిగాయో కాదు,
వాటి ధర ఎవరు చెల్లించారో చూడాలి.
అమెరికాలో అప్పులు భరించేది సామాన్య పౌరుడు.
ఇరాన్‌లో ఆంక్షల భారం మోసేది సాధారణ ప్రజలు.
ఇజ్రాయిల్‌లో యుద్ధ భయంతో జీవించేది సాధారణ కుటుంబాలే.
చనిపోయేది, బతికీ నరకం చూసేది మాత్రం ఎప్పుడూ సామాన్య ప్రజలే
సంబంధం లేకపోయినా

**4 యుద్ధం లేకున్నా యుద్ధ ప్రభావం భారతీయ అనుభవం..**

ప్రత్యక్ష యుద్ధాల్లో పాల్గొనకుండా శాంతిని ఆశ్రయించిన దేశం భారతదేశం కానీ తీవ్రవాదం, సరిహద్దు ఉద్రిక్తతలు, విదేశీ ప్రేరణలతో జరిగే టెర్రరిస్ట్ హింస దేశాన్ని నిరంతరం అప్రమత్తంగా ఉంచుతున్నాయి. దీని వల్ల అభివృద్ధి కోసం వినియోగించాల్సిన వనరులు భద్రతకే మళ్లుతున్నాయి. ప్రజల్లో భద్రతాభావం పెరుగుతోంది. సైనికులు ప్రాణాలు అర్పిస్తుంటే, సామాన్య పౌరుడు అనిశ్చితిలో జీవించాల్సి వస్తోంది. ఇక్కడ యుద్ధం జరగకపోయినా, యుద్ధానికి సిద్ధంగా ఉండే జీవితం మాత్రం ప్రజలపై మౌనమైన భారం వేసింది..పాలకుల వ్యూహాలు దేశాన్ని కాపాడుతున్నా, వాటి ధరను చెల్లించేది ఎప్పుడూ సామాన్య ప్రజలే.